www.vaarthavedhikasurya.com

PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 345 | మంగళవారం, 12 మే, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 345 | TUESDAY, MAY 12, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## పోలవరం 'రెండో దశ' చేపట్టవద్దు

పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి బోర్డుకు తెలంగాణ లేఖ

ప్రాజెక్టు ఎత్తును పెంచడంపై అభ్యంతరం

తెలంగాణలో ముంపు సమస్యపై ఆందోళన



2 లో..



## గవర్నర్‌ను కలిసిన సిఎం రేవంత్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే11: రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసారు. జూన్ 12న పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సభకు గవర్నర్‌ను ఆహ్వానించారు. విద్యార్థులు పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ప్రవర్తించాలని సభలో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గతంలో సూచించిన గవర్నర్ మిగతా 2లో..

# 'ప్రైవేటు'లో గొప్ప ఏంటి? మన బలహీనతేంటి?

- టీచర్లు గంట అధనంగా పనిచేయాలి
- విదేశీ టూర్లకు 500 మంది టీచర్లను పంపిస్తాం
- ఇకపై జూన్ 2న ఉత్తమ టీచర్లకు పురస్కారం, సన్మానం
- కులానికో రెసిడెన్షియల్ పాఠశాలతో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్షను రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే ఆ శాఖను పర్యవేక్షస్తున్నా
- విద్యా వారోత్సవాల ప్రారంభ సభలో సిఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే 11: రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్లతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలో రెట్టింపు సంఖ్యలో ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులు మాత్రం సర్కార్ బడుల్లో చాలా తక్కువగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 27వేల ప్రభుత్వ పాఠశాలలో 19 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా.. 12వేల ప్రైవేట్ స్కూళ్లలో 38లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు 1.05 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలని జాతీయ విద్యా విధానం నిబంధనలు చెబుతుంటే.. మన వద్ద 17మందికి ఒకరు చొప్పున ఉన్నారని వెల్లడించారు. అయినా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడం వెనుక కారణాలేంటో ఉపాధ్యాయులు ఆలోచించాలన్నారు. ప్రైవేట్‌లో ఉన్న గొప్పతనం ఏంటి మన బలహీనత ఏంటి అన్నది టీచర్లు సమీక్షించుకోవాలి అని సీఎం సూచించారు. పేద విద్యార్థుల తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందం చూడాలంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఒక గంట అదనంగా మిగతా 2లో..




# గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

## పెండింగ్ అంశాలను పరిష్కరించండి

తొలిదశ నిర్మాణాలను పూర్తి చేయడానికి సహకరించండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు

న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నా రా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. 2027 గోదావరి పుష్కరాల్లోపు ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అలాగే, పలువురు కేంద్ర మంత్రులను కలిసి ఏపీకి సంబంధించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ క్రమంలోనే సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. తొలిదశలో 41.15 విటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సవిక్షించి నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా మిగతా 2లో..



# బంగ్లా సరిహద్దుల్లో కంచె

- 45 రోజుల్లో బీఎస్ఎఫ్‌కు భూమి బదిలీ
- ఫెన్సింగ్‌తో అక్రమ చొరబాట్లకు చెక్
- పశ్చిమ బెంగాల్ నూతన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- రాష్ట్రంలో అమలయ్యే పథకాల్లో అనర్హులను ఏరివేస్తాం
- ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం
- బెంగాల్ సిఎం సువేందు అధికారి

కోల్‌కతా, (వార్త వేదిక సూర్య) మే 11: పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎసఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎసఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45 రోజుల్లో మిగతా 2లో..

## బండి సంజయ్ కొడుకు కేసులో

# ప్రత్యేక అధికారితో విచారణ

- 8న పేట్ బషీరాబాద్‌లో బాధితురాలు ఫిర్యాదు
- కరీంనగర్‌లో బండి భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు..
- రెండింటిపైనా విచారణ చేయాలని డీజీపీని ఆదేశించాను
- ప్రధాని పర్యటన నేపథ్యంలో విచారణ ఆలస్యమైందని డీజీపీ చెప్పారు
- చట్టానికి ఎవరూ అతీతులు కాదు
- బీఆర్ఎస్ వాళ్లు కోరుతున్నట్టు క్షణాల మీద ఏదీ జరగదు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే 11: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విచారణ కోసం ప్రత్యేక అధికారిని నియమించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంపై డీజీపీ సీవీ ఆనంద్‌తో సమీక్షించానని, వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించానని చెప్పారు. అయితే బాధితురాలు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బండి భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. దీంతో రెండు ఫిర్యాదులపైనా ప్రత్యేకంగా విచారణ చేయాలని సూచించినట్టు పేర్కొన్నారు. సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. బాధితురాలు ఈ నెల 8నే ఫిర్యాదు చేసినా చర్యలు ఎందుకు తీసుకోలేదని డీజీపీని ప్రశ్నించినట్టు తెలిపారు. అయితే ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో దాదాపు 10 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేయాల్సి వచ్చిందని, మిగతా 2లో..



# రాష్టానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని మోడీ నిధులివ్వకుండా మాటలెందుకు?

- ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు



2 లో..

# రేసింగ్ సరదాకు ఐదుగురి ప్రాణాలు బలి

- మహబూబ్‌నగర్‌లో అర్ధరాత్రి 12 బైక్‌లతో యువకుల విన్యాసాలు
- కారును ఢీకొన్న స్పోర్ట్స్ బైక్..
- 10 అడుగుల మేర ఎగిరిపడ్డ వాహనాలు
- కారులోని 8 మందిలో ముగ్గురి దుర్మరణం
- నలుగురికి తీవ్రగాయాలు
- మృతుల్లో తల్లీకొడుకు
- ప్రమాదానికి కారణమైన బైక్‌పైనున్న ఇద్దరూ మృతి

2 లో..



## మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల

# యూరియా బఫర్ స్టాక్

- రామగుండం ఎరువుల కర్మాగారం నుండి 90 శాతం సరఫరా చేయాలి
- రైతులకు నానో యరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
- ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు
- సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సహకాలు అందించాలి
- రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్
- ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష



2 లో..

సంపుటి: 1 సంచిక: 345 వార్త వేదిక సూర్య మంగళవారం, 12 మే, 2026

## బంగ్లా సరిహద్దుల్లో కంచె

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

## రాష్టానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని నిధులివ్వకుండా మాటలెందుకు?

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే 11:

ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేవి ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్టానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేవి ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం విడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆరఆరఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతి పత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర.. ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయ్యాయని తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జలశక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి సీంచాయి యోజన కింద ఏపీలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునికీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఏపీ వ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 విటర్ల నుంచి 524.256 విటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని.. ఎలాంటి సాంకేతిక, పాలనా పరమైన అనుమతులు మంజూరు చేయొద్దని సీఎం చంద్రబాబు సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-ఎఎఎ కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం ‘ బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలలను మళ్లించేలా పోలవరం ‘ బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా జలశక్తి శాఖ మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

# 'ప్రైవేటు'లో గొప్ప ఏంటి? మనలో బలహీనతేంటి?

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలని కోరారు. ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా జవారోత్సవాలను సోమవారం హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ప్రారంభించి ప్రసంగించారు.

**కులానికో రెసిడెన్షియల్ పాఠశాలతో పెరుగుతున్న కులవివక్ష**

ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన'ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. ‘తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి.

అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సమీక్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం‘ అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం‘ అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు. 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాలు, రాగిజావతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని, కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. అలాగే రూ. 1,000 కోట్లతో ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ వస్తువుల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని పేర్కొన్నారు. ‘విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని బొక్కలో తోయించే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ, వారికి ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని సీఎం చెప్పారు. ‘టీచర్లకు ఇది కేవలం ఉద్యోగం కాదు.. అదొక బాధ్యత. 19 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు వి చేతుల్లో ఉంది. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పనిచేయాలి‘ అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి అభివృద్ధి వేదికలని చాటిచెప్పేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

## మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 11:

జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, మే నెలాఖరు నాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యరియా సరఫరా, నిల్వలు మరియు నానో యరియా వినియోగంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత/జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ కేటాయింపుల ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మరియు ఆగస్టు నెలల్లో నెలకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 1 లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఏప్రిల్ నెలలో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకుగాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరాయని, మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు. Sష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రేక్ పాయింట్లకు చేరిన యరియాను జిల్లాలకు తరలించే ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్ మరియు రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్ సేల్ మరియు రిటైల్ లో ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర యరియా యాప్ ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్ ను తీసుకువస్తుందని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రెండు జిల్లాలలో ఈ యాప్ ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మన రాష్ట్రంలో రంగారెడ్డి మరియు మేడ్చల్ జిల్లాలలో ఈ యాప్ ను అమలు చేయనున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నానో యరియా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నానో యరియా తయారీ సంస్థలు కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. నానో యరియా వాడుతున్న రైతుల అనుభవాలను వీడియో రూపంలో చిత్రీకరించి ‘రైతు నేస్తం‘ కార్యక్రమంలో ప్రసారం చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని, సాధారణ యరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు, నానో యరియా ప్రయోజనాలపై రైతులకు వివరించాలని ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని మంత్రి కోరారు. రైతులు యరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యరియాను అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని, ఆ ఫలితాల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగిస్తే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ / ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మి, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా. గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## రేసింగ్ సరదాకు ఐదుగురి ప్రాణాలు బలి

మహబూబ్‌నగర్, (వార్త వేదిక సూర్య)-మే 11:

యువకుల స్పోర్ట్స్ బైక్ రేసింగ్ సరదా ఆ దారిన కారులో వెళుతున్న అమాయకుల నిండు ప్రాణాలను బలిగొంది. కారును మితిమీరిన వేగంతో ఓ స్పోర్ట్స్ బైక్ ఢీకొనడంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్నవారిలో ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ప్రమాదానికి కారణమైన స్పోర్ట్స్ బైక్‌పై ఉన్న ఇద్దరూ ప్రాణాలొదిలారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పట్టణంలోని ప్రేమ్‌నగర్, మర్లు ప్రాంతాలకు చెందిన రెండు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది ఆదివారం రాత్రి బైపాస్ రోడ్డులో ఉన్న యూబీగార్డెన్‌లో జరిగిన ఓ శుభకార్యానికి కారులో వెళ్లారు. వేడుక అనంతరం అక్కడి నుంచి వారంతా అదే కారులో రాత్రి 12:30 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. అరగంట తర్వాత బైపాస్ రహదారిలో గల పాలకొండ చౌరస్తా శివాజీ విగ్రహం దగ్గర మర్లు వైపు వెళ్లేందుకు కారును తిప్పారు. అదే సమయంలో భూత్పూర్ రహదారి నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న 12 రేసింగ్ బైక్‌లు పెద్దశబ్దం చేస్తూ దూసుకొచ్చాయి. వీటిలో ఓ స్పోర్ట్స్ బైక్, రోడ్డు క్రాస్ చేస్తున్న కారు వెనుక డోర్‌ను దాదాపు 180 కి.మీ. వేగంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు వాహనాలు కూడా పది అడుగుల మేర ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో కారులో ఉన్న ప్రేమ్‌నగర్‌కు చెందిన అర్షియా బేగం (30), ఆమె కుమారుడు హాఫీఫ్ (8), ఆమె మరదలు రేష్మా కుమారుడు అమర్ (2) అక్కడికక్కడే మృతిచెందారు. అర్షియా తల్లి గౌసియా, గౌసియా కూతురు రేష్మా, రేష్మా కుమారుడు హిమ్రానుద్దీన్, వారి బంధువుల కుమారుడు జాహిద్‌కు తీవ్రగాయాలయ్యాయి. కారు నడుపుతున్న అర్షియా బేగం భర్త బాసిత్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. కళ్లెదుటే భార్య అర్షియా, కుమారుడు హాఫీజ్ చనిపోవడంతో గుండెలవిసేలా రోదించాడు. ఈ ప్రమాదంలో స్పోర్ట్స్ బైక్‌పై ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఒవైజీ (25), అఫ్జల్ యాకుబ్ (25) అక్కడికక్కడే మృతిచెందారు. మహబూబ్‌నగర్ రూరల్, జడ్చర్ల పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను స్థానిక జనరల్ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే మిగతా బైక్ రేసర్లు అక్కడి నుంచి పరారయ్యారు. వారికోసం పోలీసులు గాలిస్తున్నారు.

## పోలవరం 'రెండో దశ' చేపట్టవద్దు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 11:

పోలవరం రెండో దశ నిర్మాణ పనులు చేపట్టరాదని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కి, గోదావరి బోర్డుకు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) రమేశ్‌బాబు ఈనెల 5న లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టును తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తుతో కడుతుండగా... రెండో దశలో 45.72 మీటర్ల ఎత్తుతో కట్టాలని తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంపై తెలంగాణ అభ్యంతరం తెలిపింది. పోలవరంలో 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేస్తే తెలంగాణలో ముంపు సమస్య తీవ్రంగా ఉంటుందని రమేశ్‌బాబు లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం కారణంగా ఇప్పటికే తెలంగాణలోని 36 స్థానిక నదులు గోదావరిలో కలవకుండా ఆ నీరంతా వెనక్కి తన్నడంతో రాష్ట్రంలో 956 ఎకరాలు మునిగిపోతోందని, పలు సర్వేల్లోనూ దీన్ని గుర్తించారని తెలిపారు. ఎన్‌జీటీ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో జరిగిన సర్వేలోనూ ఇది నిర్ధారణ అయిందన్నారు. గోదావరి ట్రైబ్యునల్ తీర్పు ప్రకారం ముంపు నుంచి రక్షణ చర్యలు చేపట్టే వరకు ఎటువంటి పనులు చేపట్టరాదని గుర్తు చేశారు. కాగా, పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ(35.5 మీటర్ల నుంచి 32 మీటర్ల మధ్యలో) నిల్వ ఉండే 30 టీఎంసీలను కుడికాలువ ద్వారా తరలించడానికి వీలుగా చేపట్టిన పోలవరం ఎత్తిపోతల పథకాన్ని కూడా నిలిపివేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది.

## బండి సంజయ్ కొడుకు కేసులో ప్రత్యేక అధికారితో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఏర్పాట్లలో నిమగ్నం కావడం వల్లే జాప్యం జరిగిందని డీజీపీ చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు విచారణ ప్రారంభమవుతోందని, విచారణ తరువాత పోలీసులు చర్యలు తీసుకుంటారని అన్నారు. అయితే బీఆర్‌ఎస్ వాళ్లు కోరుతున్నట్టు క్షణాల మీద ఏదీ జరగదని, ఎవరిపైనైనా చట్ట ప్రకారమే చర్యలుంటాయని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గతంలో పోలీస్‌శాఖలో పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. భగీరథ్‌పై ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసిందీ పోలీసులేనని, ఈ విషయం ప్రవీణ్‌కుమార్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పటివరకు తాము ఎవరినీ వదిలిపెట్టలేదన్నారు. ఫాంహౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికిన కేటీఆర్ బావమరిదిని కూడా వదల్లేదని తెలిపారు. కేటీఆర్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఖాళీగా ఉన్నామని డ్యూటీ చేస్తామంటే ఎలా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారంటూ ఎన్నికల కమిషన్‌కు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారని సీఎం గుర్తు చేశారు. అయితే విచారణ సమయంలో ఆయనను పిలిస్తే.. ప్రభాకర్‌రావు నీతిమంతుడన్న చందంగా మీడియా ఎదుట మాట్లాడారని తెలిపారు. గడీలు బద్దలు కొడతానని, బీఆర్‌ఎస్ హయాంలో విద్యా వ్యవస్థ కుప్పకూలిపోయిందని గతంలో చెప్పిన ప్రవీణ్‌కుమార్.. ఇప్పుడు అదే గడీల ముందు తిరుగుతున్నారని అన్నారు. మైకుల ముందు నాయకులు ఇచ్చే స్టేట్‌మెంట్ల ఆధారంగా కేసుల విచారణ జరగదని, ప్రవీణ్‌కుమార్ వద్ద ఏవైనా ఆధారాలుంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని సూచించారు. ప్రధాని మోదీ సభకు 48 గంటల ముందే బండి భగీరథ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. ఈ కేసు మైనర్‌కు సంబంధించినదని, అంతా భాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు.

## గవర్నర్‌ను కలిసిన సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచనను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ప్రభుత్వం నిర్నయించింది. ఈ కార్యక్రమానికి గవ్రరన్‌ను సిఎం ఆహ్వానించేందుకు కలిసారు.

# మణికొండలో మున్సిపల్ కమిషనర్ పర్యటన



సమస్యల పరిష్కారానికి హామీ



**మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :**
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన సోమవారం మణికొండ వార్డ్ 127లో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యంగా అబ్దుల్ కలాం పార్క్ పరిసరాలను సందర్శించి పారిశుధ్యం, వీధి దీపాలు మరియు ఇతర మౌలిక వసతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆమెను కలిసి పలు దీర్ఘకాలిక సమస్యలను విన్నవించారు. పంచవటి కాలనీ అధ్యక్షుడు మరియు 'ది సిటిజన్స్ కౌన్సిల్' వ్యవస్థాపక అధ్యక్షుడు సీతారాం ధూలిపాళ కమిషనర్ దృష్టికి కీలక అంశాలను తీసుకువచ్చారు. రోడ్ నెం.10 వద్ద చెక్‌డ్యామ్‌తో బుల్కాపూర్ నాలాను పునరుద్ధరించాలని, తద్వారా నీటిని షేక్‌పేట్ నాలాకు మళ్లించి పందేన్ వాగుపై భారాన్ని తగ్గించాలని కోరారు. వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా సమగ్ర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అవసరమని వివరించారు. మర్రిచెట్టు రోడ్డులో తొలగించిన బస్ షెల్టర్లను పునరుద్ధరించాలి. ట్రైల్స్ విల్లాస్ వద్ద బాక్స్ డ్రెయిన్ కమ్ రోడ్ మరియు రోడ్ నెం.10 బ్రిడ్జ్ కనెక్టివిటీ ద్వారా ట్రాఫిక్ చిక్కులను తొలగించాలి. గెజిట్ ప్రకారం వార్డ్ 127 సరిహద్దులను ఖరారు చేయాలన్నారు. వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు ఉపేంద్రనాథు రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో లైబ్రరీ ఏర్పాటు, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ముఖ్యంగా గోల్డెన్ టెంపుల్ నుండి తారామతి బారాదరి మధ్య ఉన్న ఆక్రమణల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రతినిధుల విన్నపాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డ్రైనేజ్ నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, జూన్ 1వ తేదీ నుండి డ్రైనేజ్ నిర్వహణ బాధ్యతలను జలమండలికి అప్పగించనున్నట్లు ఆమె కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# శివరాంపల్లి యూపీహెచ్సీలో ఘనంగా "టీబీ ముక్త భారత్ అభియాన్" క్యాంపు



## - 153 మందికి వైద్య సేవలు
## - 25 మందికి ఎక్స్-రే పరీక్షలు



**మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని శివరాంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో సోమవారం "టీబీ ముక్త భారత్ అభియాన్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో మొత్తం 153 మంది ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అందులో అనుమానిత లక్షణాలు ఉన్న 25 మందికి ప్రత్యేకంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా సీవై-టీబీ కిట్లను 16 మంది స్వీకరించినట్లు వైద్య అధికారులు తెలిపారు. క్యాంపులో పాల్గొన్న వైద్య నిపుణులు టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానం గురించి ప్రజలకు వివరించారు. సమయానికి పరీక్షలు చేయించుకోవడం ద్వారా టీబీని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.
టీబీ రహిత భారతదేశ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వైద్య అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్, కోఆర్డినేటర్ గౌరీ, ఎస్‌టీఎల్ఎస్ రహీం, ఎస్‌టీఎస్ నరేష్ కుమార్, టీబీహెచ్‌వీ మధుబాబు, కిరణ్, సిస్టర్స్, ఎ ఎన్ ఎం ప్రేమ దేవి ఆశా కార్యకర్తలు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ జోన్ పరిధిలో వీధి వ్యాపారులపై అక్రమ వసూళ్లు వెంటనే అరికట్టాలి



కామన్ ప్లాట్‌ఫామ్ ఎన్ జి ఓ డిమాండ్

**మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోనల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల నుండి స్థానిక వెల్ఫేర్ సొసైటీల పేరుతో సాగుతున్న అక్రమ వసూళ్లపై 'కామన్ ప్లాట్‌ఫామ్' ఎన్ జి ఓ ప్రతినిధి క్రాంతి వర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అరాచకాలను అరికట్టి పేద వ్యాపారులను ఆదుకోవాలని కోరుతూ రాజేంద్రనగర్ జోనల్ కమిష నర్‌కు ఫిర్యాదు చేశారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, బుద్వేల్, ఉప్పరపల్లి, శివరాంపల్లి, కిస్మత్పూర్, బండ్లగూడ తదితర కాలనీల్లో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వారి వద్ద కొందరు వ్యక్తులు తాము స్థానిక వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులమని చెప్పుకుంటూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని క్రాంతి వర్మ ఆరోపించారు. ఒక్కో టేబుల్ లేదా స్టాల్‌కు రోజుకు □30 నుండి □60 వరకు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వని పక్షంలో వ్యాపార సామాగ్రిని పారేస్తామని, ఇక్కడ వ్యాపారం చేయనివ్వమని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. స్ట్రీట్ వెండర్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ లైవ్లీహుడ్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండింగ్) యాక్ట్, 2014 ప్రకారం ప్రభుత్వ రోడ్లపై వ్యాపారం చేసుకునే వారి నుండి రుసుము వసూలు చేసే అధికారం కేవలం మున్సిపల్ అధికారులకు మాత్రమే ఉంటుంది.



ప్రైవేట్ వ్యక్తులు లేదా వెల్ఫేర్ సొసైటీలు టెండర్లు వేసుకుని, బహిరంగ రోడ్లపై ఛార్జీలు వసూలు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధం అని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే కరోనా లాక్డౌన్ ప్రభావం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో రవాణా ఖర్చులు పెరిగి చిరు వ్యాపారులు ఆర్థికంగా చితికిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో అక్రమ వసూళ్ల వల్ల వారు మరింత కుంగిపోతున్నారని క్రాంతి వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల వద్ద గుర్తింపు కార్డులు ఉండి, బ్యాంకుల ద్వారా లోన్లు పొందిన వీధి వ్యాపారులను వేధించడం అన్యాయమన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పేద వ్యాపారులకు రక్షణ కల్పించాలని జిహెచ్ఎంసి అధికారులను ఆయన డిమాండ్ చేశారు.






# మహిళలకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ

- చిల్కూర్ ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజుల ప్రత్యేక శిక్షణ



**మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :**
నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఎస్ బి ఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయి మెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం నిర్వహించ బడుతోంది. ఈ శిక్షణ 13 మే 2026 నుంచి ప్రారంభం కానుండగా, గ్రామీణ ప్రాంత మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా 30 రోజుల పాటు ప్రాయోగిక శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫాం, టూల్ కిట్లు కూడా అందించ బడతాయని సంస్థ సంచాలకులు మహమ్మద్ అలీ ఖాన్ తెలిపారు. మగ్గం వర్క్ ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయని, ఈ శిక్షణ వారికి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలి : బీఆర్ఎస్ నేత గాజుల నరేష్ యాదవ్ డిమాండ్

**మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :**



రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గాజుల నరేష్ యాదవ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు బండి సాయి భగీరథను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై జరిగిన ఘటనలో మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలపై సాయి భగీరథపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధి కారులను కోరారు. బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలపై సాయి భగీరథపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పోలీసు ఉన్నతా ధికారులను కోరారు. బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. చట్టం ముందు అందరూ సమానులేనని, రాజకీయ ప్రభావా లకు లోనుకాకుండా పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని గాజుల నరేష్ యాదవ్ అన్నారు. గతంలో కూడా విద్యాసంస్థల్లో ర్యాగింగ్, భౌతిక దాడులు, సహ విద్యార్థులపై అరాచకాలకు సాయి భగీరథ పాల్పడినట్లు ఆరోపించారు.



# ప్రేమవతిపేటలో వ్యక్తి అదృశ్యం: ఆచూకీ తెలిస్తే తెలపాలని విజ్ఞప్తి

**మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రేమవతిపేటకు చెందిన కే. జయన్న (40) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకునే జయన్న, పనుల నిమిత్తం ఇంటి నుండి బయటకు వెళ్లారు. అయితే, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో మరియు ఇతర ప్రాంతాలలో వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయన్న ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ, లేదా కుటుంబ సభ్యులకు గానీ సమాచారం అందించాలని వారు విన్నవిస్తున్నారు.

# వర్షాకాలం వేళ ప్రజలకు కష్టాలు కలగొద్దు

- అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆదేశం

**మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :**



రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాజేంద్ర నగర్ జోన్ పరిధిలోని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికా రులను ఆదేశించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, హైడ్రా, మరియు ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఎదురయ్యే సవాళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హైడ్రా విభాగం జోన్ పరిధిలో వర్షపు నీరు నిలిచే 30 ప్రాంతాలను గుర్తించిందని తెలిపారు. ఇందులో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోనే 15 పాయింట్లు ఉన్నాయని, మిగిలిన సర్కిళ్లైన చాంద్రాయణగుట్ట, జంగంమెట్, ఫలక్ నుమా, బహదూర్‌పురా ప్రాంతాల్లో మరో 15 పాయింట్లు ఉన్నాయని వివరించారు. ఈ ప్రాంతాల్లో నీరు నిలవకుండా ఇప్పటి నుంచే ఇంజనీరింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారువర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే హైడ్రా, జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హైడ్రా జోనల్ ఇంచార్జీ మహేష్, జీహెచ్ఎంసీ ఎస్.ఈ. నరేందర్ గౌడ్, ఈ.ఈ. వెంకట శేషయ్య మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంచిక: 345 వార్త వేదిక సూర్య
హైదరాబాద్ మంగళవారం, మే 12, 2026



# సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల

సికింద్రాబాద్, మే 11(వార్త వేదిక సూర్య)

99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యా వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతాఫల్‌మండి మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల హాజరయ్యారు వారం రోజుల పాటు నిర్వహించనున్న విద్యా ఉత్సవాలను అధికారికంగా ప్రారంభించి, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ పోస్టర్ ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సాధికారత, ఉన్నత విద్యాభివృద్ధి దిశగా కళాశాల చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. అనంతరం వివిధ రంగాల్లో స్థిరపడి సేవలందిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఎన్.జి.కె. మూర్తి, అధ్యాపకులు శివనారాయణ రావు, సుధ, వెంకటేశం, రాజు, రాఘవేంద్ర, సరోజ, రజిని, విమల, ఐమన్ మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బండి భగీరథను కఠినంగా శిక్షించాలి

**బండి సంజయ్ ను కేంద్రం మంత్రివర్గం నుండి తొలగించాలి : డివైఎఫ్ఐ**

నల్లగొండ బ్యూరో, మే 11 (వార్త వేదిక సూర్య )



బాలిక పై అఘాయిత్యానికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ను వెంటనే అరెస్ట్ చేయాలని, అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కేంద్ర మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నల్గొండ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడుతూ, దేశంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఇటువంటి ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల కుటుంబ సభ్యులు నేరాలకు పాల్పడినా ప్రభుత్వం, పోలీసులు తక్షణ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. చట్టం అందరికీ సమానమైతే నిందితుడిపై వెంటనే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని, కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రత్యేక వేగవంతమైన విచారణ నిర్వహించాలని కోరారు. మహిళల భద్రతపై పెద్ద పెద్ద మాటలు చెప్పే పాలకులు, ఇలాంటి ఘటనల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. బాధితులను భయపెట్టి నిందితులను కాపాడే ప్రయత్నాలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా యువజనులు, ప్రజాసంఘాలు ఈ ఘటనపై స్పందించాలని అన్నారు. ఈ సమావేశంలో డి వై ఎఫ్ ఐ జిల్లా ఉపధ్యక్షులు గుండాల నరేష్, సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి జిల్లా నాయకులు పోకల శశిధర్, అంజి, కార్తీక్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ మే 11 (వార్త వేదిక సూర్య ):-



దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామానికి చెందిన ఇమ్మరాసు రమేష్ - ప్రేమలత ల కుమారుడు అక్షయ్ - గౌతమ్ ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం దేవరకొండ పట్టణంలోని టీ ఎం ఆర్ పంక్షన్ లో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుపల్లి సర్పంచ్ చాట్ల రమాదేవి రాములు,బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు,బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, మైనంపల్లి ప్రవీణ్, పెరుమాళ్ళ ధర్మయ్య, ఎట్టేల్లి వినోద్,మైనంపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వెంకన్న గుట్టలో వైభవంగా 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు



**- హనుమజ్జయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు**

**- భక్తులను ఆహ్వానించిన దేవస్థాన కమిటీ**



మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :

అత్తాపూర్ సర్కిల్ మైలార్దేవ్పల్లి పరిధిలోని టి.ఎన్.జి.ఓస్ కాలనీ, వెంకన్న గుట్టలో వెలసిన శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ సాలగ్రామ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ పరిసరాలు విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరించబడగా భక్తుల రద్దీతో శ్రీ వెంకన్న గుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సోమవారం నిర్వహించిన బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఉదయం నుంచే ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆరాధన, సేవాకాలం, భాలభోగం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వారాతోరణ ధ్వజకుంభారాధన, నవకలశ స్నపనం వంటి వైదిక కార్యక్రమాలను అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. అనంతరం ఉదయం 9:30 గంటలకు చక్రతీర్థం, నిత్యావాహనం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేసి నివేదన శాత్తుమొరై నిర్వహించారు. సాయంత్రం ఆరాధన, సేవాకాలం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం అనంతరం ద్వారా తోరణ ధ్వజ కుంభారాధన, ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, ఉద్వాసనలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్పయాగం కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా నిర్వహించిన చక్రస్నానం మహోత్సవం ఆలయ ప్రధాన ఆకర్షణగా నిలిచి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఇదిలా ఉండగా, మంగళవారం హనుమజ్జయంతి ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. తేది 12-05-2026 మంగళవారం ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం నిర్వహించనుండగా, ఉదయం 7 గంటలకు విశేష అర్చనలు చేపట్టనున్నారు. సాయంత్రం 6:30 గంటలకు తమలపా కులతో అర్చనలు, 108 అరటి పండ్లతో ప్రత్యేక పూజలు, అప్పులమాలా, వడమాలతో విశేష సేవలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హనుమజ్జయంతి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. ఈ మహోత్సవాల్లో పాల్గొనే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సేవా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ భక్తులందరిని అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదములు సేవించి, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ సాలగ్రామ వేంకటేశ్వర స్వామివారి పరిపూర్ణ కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రతినిధులు కోరారు.

# తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌గా రంగారెడ్డి క్రీడాకారులు




**- ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు**

**- విజేతలకు బహుమతులు అందజేసిన కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్**

మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :

కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా గత రెండురో జులుగా జరిగిన 'తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ - 2026' పోటీలు ఆదివారం సాయంత్రం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. రంగారెడ్డి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల ముగింపు వేడుకకు కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణను, పట్టుదలను పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యత వల్ల గ్రామీణ స్థాయి క్రీడాకారులు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. 1000 మంది క్రీడాకారుల భాగస్వామ్యం తో రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ జిల్లాల నుండి సుమారు 1000 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు ఈ ఏడాది జరగనున్న 'నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ - 2026' కు అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలి పారు. తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎం. మైపాల్ మాస్టర్, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం. నర్సింగరావుల పర్యవేక్షణలో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించారు . అసోసియేషన్ సభ్యులు ఎస్. వెంకటేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సనమ్ రాజు గౌడ్, ఆర్. కుమార్, పోతురాజు రమేష్, గురుస్వామి, అశోక్ కుమార్, సంతోష్ మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్ వ్యవహారంలో ప్రభుత్వం మౌనం వీడాలి

**– కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ డిమాండ్**

మైలర్ దేవ్ పల్లి, మే 11 ( వార్త వేదిక సూర్య ) :



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లా డుతూ..మైనర్ బాలికకు మద్యం తాగించి అత్యాచా రానికి పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి. ఇంతటి దారుణం జరిగినా ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదు. బాధితు రాలికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి. ఇలాంటి కేసుల్లో రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా చట్టం తన పని తాను చేసుకోవాలి. అని పేర్కొన్నారు. ఆయన లేవనెత్తిన కీలక డిమాండ్లు: చట్టం ముందు అందరూ సమానమే నిందితుడు ఎవరైనా, ఎంతటి రాజకీయ పలుకుబడి ఉన్నా సరే.. చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలి. మహిళల భద్రతకు ప్రాధాన్యత మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. రాజకీయ ప్రయోజనాల కోసం కేసును నీరుగార్చకూడదు. పోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసుల్లో విచారణ ఆలస్యమైతే సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. తక్షణమే నిజాలను వెలుగులోకి తెచ్చి బాధ్యులను శిక్షించాలి. మహిళల రక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీపడకుండా, తక్షణమే ఈ వ్యవహారంపై స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



# గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటు

**రాష్ట్రంలో ఎస్. సి, ఎస్.టి సంక్షేమ శాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే మంత్రి పదవి కి రాజినామా చేయాలి**

**ఖమ్మంపాటి శంకర్ ఎస్. ఎఫ్. ఐ జిల్లా కార్యదర్శి**

నల్లగొండ బ్యూరో, మే 11 (వార్తా వేదిక సూర్య )

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టి జనరల్ హాస్టల్లో మరియు కళాశాల వసతి గృహ విద్యార్థులకు మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయకుండా ప్రభుత్వం గిరిజన విద్యార్థులపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేయడం జరిగినది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల మెస్ కాస్మెటిక్ చార్జీలను విడుదల చేస్తామని పత్రికల్లో తాటికాయ లాంటి అక్షరాల్లో గొప్పలు చెప్పిన ఆచరణ మాత్రం గడప దాటడం లేదని అందులో అర్థం చేయడం జరిగింది. సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు నెల నెల మెస్ కాస్మెటిక్ విద్యార్థులు విడుదల చేయకపోవడంతో వసతి గృహ అధికారులు విద్యార్థులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా ఉండడం కోసం బహిరంగ మార్కెట్లో అప్పులు తీసుకొచ్చి వడ్డీలకు తీసుకువచ్చి చివరికి తమ భార్యల మెడలో ఉన్న పుస్తెలతాడును సైతం బ్యాంకుల్లో కుదువబెట్టి వసతి గృహ లను ఎంతో సక్రమంగా ప్రభుత్వానికి చెడ్డపేరు రావద్దన్నఅన్న ఉద్దేశంతో వారు ఇంతే బాధలు పడ్డ విద్యార్థుల సంక్షేమం కోసం అధికారుల పాటుపడిన వసతి గృహ అధికారులకు గొంతుపై కత్తి పెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి గారు సుమారు నెలరోజుల్లో తిరిగి విద్యా సంవత్సరం పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన విద్యార్థులకు చేదు అనుభవం ఎదురయ్యే ప్రమాదం ఉందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వాలు బతికి బట్ట కట్టలేదన్న చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎస్. సి, ఎస్ . టి సంక్షేమ మంత్రి రాష్ట్రం లో రబ్బర్ స్టాంప్ గా మారారని అన్నారు. గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థుల పై ఏమాత్రం ప్రేమ వున్న తక్షణమే మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతన్నల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయి

## రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ మే 11 (వార్త వేదిక సూర్య):-

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతన్నల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం పీఏపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుల తరబడి కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశులను పరిశీలించిన ఆయన, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో వడ్లు రోజుల తరబడి పేరుకుపోతున్నాయి అని ఆయన అన్నారు. రైతులు తీసుకొచ్చిన వడ్లలో అధికంగా తేమ, నాణ్యత పేరుతో అనవసర కోతలు విధిస్తున్నారు ఆయన తెలిపారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. పంట వేసిన నాటి నుంచి పండించిన పంటను అమ్ముకునే వరకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. కాంటాలు సకాలంలో జరగక రైతులు ఎండలో, వర్షంలో రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది ఆయన అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన పర్యవేక్షణ లేక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని ఆయన అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు ఆలస్యం అవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతున్నా సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదు అని ఆయన అన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కాంటాలు నిర్వహించాలి అని ఆయన డిమాండ్ చేశారు. సరిపడా లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంటనే తరలించాలి..రైతుల వడ్లలో అన్యాయ కోతలు నిలిపివేయాలి అని ఆయన కోరారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పై కి తిట్ల పురాణం తప్ప రైతుల సమస్యలపై ఆయనకు అవగాహన లేదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే వడ్ల కొనుగోలు ప్రారంభించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

సంచిక: 345 వార్త వేదిక సూర్య హైదరాబాద్ మంగళవారం, మే 12, 2026



# పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

## కోర్లపాడ్ టోల్ ప్లాజా చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ బ్యూరో, మే 11 (వార్తా వేదిక సూర్య )

రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో పశువుల అక్రమ రవాణా జరగకుండా జిల్లా పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఇందులో భాగంగా కోర్లపాడ్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా కంటైనర్ లారీలు, లోడ్ వాహనాలు, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, పశువుల రవాణాకు అవసరమైన అనుమతులు, డ్రైవర్ల వివరాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రవాణా సమయంలో పశువుల పట్ల క్రూరత్వం ప్రదర్శించినా, నిబంధనలకు విరుద్ధంగా తరలించినా సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. పశువులను రవాణా చేసే వ్యక్తులు తప్పనిసరిగా సంబంధిత అనుమతి పత్రాలు, కొనుగోలు రసీదులు, వెటర్నరీ ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. వాహనాలలో సామర్థ్యానికి మించి పశువులను ఎక్కించరాదని, పశువులకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

రవాణా సమయంలో పశువులకు తాగునీరు, ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని, జంతు సంరక్షణ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అక్రమ రవాణా లేదా అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వాహనాలను అడ్డుకోవడం, గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే డయల్-100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా,మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు లేదా సందేశాలు పంపించే వారిపై ఐటీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. టోల్ ప్లాజాలు, ప్రధాన రహదారులు, అంతర్‌జిల్లా సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పి వెంట నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, నకేరేకల్ సీఐ హరిబాబు, కేతపల్లి ఎస్.ఐ సతీష్,శాలిగౌరారం ఎస్.ఐ సైదులు మరియు సిబ్బంది ఉన్నారు.

# "విద్యా వారోత్సవాల" కార్యక్రమాల కరపత్రం ఆవిష్కరణ

నల్లగొండ బ్యూరో, మే 11 (వార్తా వేదిక సూర్య )



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) నల్గొండ లో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా, "విద్యా వారోత్సవాల" కార్యక్రమాల కరపత్రం విడుదల వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ మేయర్ బుర్రి చైతన్య రెడ్డి, ప్రత్యేక అతిథిగా 47 వ వార్డు కార్పొరేటర్ అబ్బ గోని కవిత పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఇందులో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె శ్రీనివాసరాజు మాట్లాడుతూ, ఈ విద్యా వారోత్సవాల కార్యక్రమ రూపకల్పన చేయడం జరిగిందని, ఈ మొదటి రోజున కరపత్రాన్ని విడుదల అలాగే వివిధ కంపెనీలకు చెందిన వారితో మెమోరండం ఆఫ్ అండర్స్టాండింగ్ చేసుకోవటం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నల్గొండ మేయర్ బుర్రి చైతన్య రెడ్డి మాట్లాడుతూ, ఈ విద్యా వారోత్సవాలు కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఉపాధి మరియు వ్యక్తిత్వ వికాసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది ఒక గొప్ప ప్రోత్సాహకం అని తెలిపారు. విశిష్ట అతిథి అబ్బగోని కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, జిల్లాలోని మహిళల విద్య కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటువంటి ఈ కళాశాలలోనే విద్యను అభ్యసించాలని, అన్ని సౌకర్యాలు ఉన్నటువంటి ఈ కళాశాలలో ఎంచుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థినులను కోరారు. ఈ కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ విద్యా వారోత్సవాలను తేదీల వారిగా ఘనంగా జరుపుకోవాలని కళాశాల అధ్యాపకులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి మంజుల, అధ్యాపకులు డాక్టర్ పుష్పలత, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ వసంత, డాక్టర్ ఎస్ రాజారామ్, రామ్ రెడ్డి, డాక్టర్ వెంకటకృష్ణ, డాక్టర్ నరేష్, మల్లికార్జున్, రాజు, శైలజ, సమత, మిస్కిన్, సరిత, మరియు కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆశాల పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలి

## ఫిక్స్డ్ వేతనం 18000 హామీ అమలు చేయాలి

## ప్రజావాణి లో కలెక్టర్ కు ఆశల వినతి: సిఐటియు



నల్లగొండ బ్యూరో, మే 11 (వార్తా వేదిక సూర్య )

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీ ఫిక్స్డ్ వేతనం 18 వేల రూపాయలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తవిటి వెంకటమ్మ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్గొండ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ కు సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చే అతి తక్కువ పారితోషికాలు కూడా నెల నెల రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆశా వర్కర్లకు ఏప్రిల్ నెల పారితోషికం ఇప్పటివరకు రాలేదు. పారితోషికం రాక ఆశా వర్కర్లు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరాల కోసం ఆశా వర్కర్లు అప్పులు చేయాల్సి వస్తుంది. ఇ.ఎం.ఐ. లు కట్టలేక ఆశాలు అల్లాడుతున్నారు. ఆశాల ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకొని వెంటనే ఏప్రిల్ నెల పారితోషికం చెల్లించాలని, ప్రతి నెల 1వ తేదీన పారితోషికాలు వచ్చే విధంగా చూడాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారు. వీరంతా మహిళలు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులున్నారు. నేటికి వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం గ్యారెంటీ ఫిక్స్డ్ వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం చేయలేదు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు 15 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారని గుర్తు చేశారు ఆ సందర్భంగా గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటింది. ఈ కాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అయినా నేటికి వేతనాలు పెంచలేదు. 50 లక్షల ఇన్సూరెన్స్, 50 వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినా, ఇంకా అమలు చేయటం లేదు. పి.ఆర్.సి. ఎరియర్స్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్నాయని ఆరోపించారు. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6 నెలల పి.ఆర్.సి. ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, 2022 నుండి 2025 వరకు నాలుగు సంవత్సరాల లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ పెండింగ్ డబ్బులు చెల్లించాలని కోరారు.ఎగ్జామ్ డ్యూటీలకు అదనపు పారితోషికాన్ని ప్రభుత్వం నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 50 లక్షల ఇన్సూరెన్స్, 50వేల మట్టి ఖర్చులకు వెంటనే జి.ఓ. లు ఇవ్వాలని,పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ., సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని. ఎ.ఎన్.ఎం, జి.ఎన్.ఎం. ట్రైనింగ్‌పూర్తి చేసిన ఆశా వర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం వెంటనే నిర్ణయించాలని కోరారు.గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆదివారం మరియు పండుగలకు సెలవులు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలి. ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని,ఆశాలతో ఎన్ . సి.డి ఆన్లైన్ పని చేయించకూడదు. స్పూటమ్ డబ్బాలు మోయించకూడదు. పూనమ్ క్లాత్తో కూడిన క్వాలిటీ యూనిఫాం సప్లై చేయాలని కోరారు ఆశాలు చేస్తున్న పారితోషికం లేని పనులన్నింటిని గుర్తించాలని,ప్రభుత్వ అన్ని ఆస్పత్రుల్లో ఆశాలకు ప్రత్యేకంగా రెస్టు రూమ్ లు ఏర్పాటు చేయాలి. ఆశాలకు పనిభారం తగ్గించాలి. పారితోషికం లేని పనులు చేయించకూడదు.ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించని యడల జూలైలో సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వీరభద్రమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లకపాక రాజు, జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు, అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు ఆదిమల్ల సుధీర్, ఆశా వర్కర్లు ప్రేమలత, వజ్రమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి



## తడిసిన ధాన్యాన్ని కటింగ్ లేకుండా తూకం వేయాలి

## కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులు

## సిపిఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

## సిపిఐఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా



నల్లగొండ బ్యూరో, మే 11 (వార్తా వేదిక సూర్య )

రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఐకెపి కేంద్రాలలో ప్రాతిపదికన కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లా మంత్రులు రబీ సీజన్ ధాన్య సేకరణ పై ఇంతవరకు సమీక్ష జరుపకపోవడం దారుణం అన్నారు. ఇకనైనా జిల్లా అధికారులతో మంత్రిగారు సమీక్షించి 15 రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతాంగాన్ని సమీకరించి ఎక్కడికక్కడ నిర్బంధిస్తామని హెచ్చరించారు. జిల్లాలో 459 కొనుగోలు కేంద్రాలలో సుమారు 6 లక్షల 50 వేలకు పైగా మెట్రిక్ టన్నుల దాన్యమును కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు సగం కూడా కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలకు దాన్యము తీసుకవచ్చిన రైతులు రోజుల తరబడి వెయిట్ చేస్తున్నారని వచ్చిన దాన్యమును వెంటవెంటనే కొనుగోలు చేయకపోవడంతో ఆకాల వర్షాలు కురవడంతో ధాన్యం తడుస్తుందన్నారు. కేంద్రాలలో అవసరమైన టార్పాన్లుకూడా అందుబాటులో పెట్టకుండా రైతులకు మంచినీరు వసతి కూడా కల్పించడం లేదన్నారు. ప్రతి రోజు రైతులు కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా పార్టీ ప్రతినిధిబృందాలు సర్వే చేసిన కొనుగోలు కేంద్రాలలో తాలు, తేమ పేరుతో తరుగు కలిపి 40 కిలోల బస్తాకు అదనంగా 2 నుండి 10 కిలోలు తూకం వేస్తున్నారని, అన్ని కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన దాన్యమును వెంటవెంటనే లారీలను పంపి ఎత్తించడం లేదని తెలిపారు. లారీలు మిల్లుల వద్ద రోజుల తరబడి దిగుమతి చేయకపోవడంతో లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపడం లేదన్నారు. మిల్లుల వద్ద వెయిటింగ్ ఉన్నందుకు రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తున్నారని, కొన్ని కేంద్రాలలో గన్నీ బ్యాగులు కొరత ఉన్నదన్నారు. ట్రక్కు షీట్లు ఇచ్చే దగ్గర కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ కొన్ని కేంద్రాలలో రైతుల వద్ద డబ్బులు కూడా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

తాలు, తరుగు పేరుతో బస్తా దాన్యమునకు అదనపు తూకంను వేయరాదన్నారు.తూకం వేసిన వెంటనే రైతులకు ట్రక్కు షీట్ ఇవ్వాలి. ట్రక్కు షీట్ ఇచ్చి 2, 3 రోజులలో రైతులకు డబ్బు జమ చేయాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రాలకు అదనపు లారీలను పంపి వేగంగా కొనుగోలు చేసి మిల్లుల వద్ద కూడా వెంటవెంటనే దిగుమతి చేయాలన్నారు.మిల్లుల వద్ద దిగుమతి చేయని పక్షంలో ప్రత్యేకంగా ప్రయివేట్ గోదాములను లీజుకు తీసుకొని దిగుమతి చేయాలని తెలిపారు. మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన దాన్యమును 'దిగుమతి చేయకుండా మిల్లర్లు కొనుగోలు చేసిన దాన్యమును దిగుమతి చేసుకుంటున్నారని అన్నారు. ఆకాల వర్షాలతో కొనుగోలు కేంద్రంలో తడిసిన దాన్యమును కూడా కటింగ్ లేకుండా తూకం వేసి,జిల్లా అధికారులు రెగ్యులర్గా పర్యవేక్షణ చేసి యుద్ధప్రాతిపదికన కొనుగోలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అన్ని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సి . పి.ఎం జిల్లా నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారీ ఐలయ్య, పాలడుగు నాగార్జున, డబ్బికార్ మల్లేష్, బండా శ్రీశైలం, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, వి వెంకటేశ్వర్లు, పి నర్సిరెడ్డి, గంజి మురళి, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య, కంబాలపల్లి ఆనంద్, బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకన్న, పెంజర్ల సైదులు, పీ వరలక్ష్మి, అవిశెట్టి శంకర్, జిట్ట నగేష్, సరోజ, కొండ అనురాధ, ఉడుగుండ్ల రాములు, కొండేటి శ్రీనివాస్, రొండి శ్రీనివాస్, నన్నూరి వెంకటరమణారెడ్డి, డి రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, చేగోని సీతారాములు, రాజు, వెంకన్న, రవి, మల్లు గౌతంరెడ్డి, మన్నెం బిక్షం తదితరులు పాల్గొన్నారు.



# మానవ జీవితం లో ప్రతి ఒక్కరికి చిన్ననాటి నుంచి యోగా ఎంతో అవసరం

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, మే 11 (వార్తా వేదిక సూర్య )

మానవ జీవితం లో ప్రతి ఒక్కరికి చిన్ననాటి నుంచి యోగా ఎంతో అవసరం అని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వైదిక యోగ పీఠ్ ఫౌండర్ కరుణాకర్ గురూజీ రూపొందించిన యోగాసనాలు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగ పట్ల అవగాహనతో పాటు నిత్య యోగ సాధన చేయడం ద్వారా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండి వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని అన్నారు. యోగాసనాల చిత్రాలతో పాటు వాటి ప్రాధాన్యత, ఎలాంటి ఆసనాలు ఎవరు చేయాలి ఎవరు చేయకూడదు అనే విషయాలను క్రోడీకరిస్తూ సమగ్ర సారాంశాలను ఈ పుస్తకాలను రూపొందించడం ద్వారా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ యోగ టీచర్లు మంజునాథ్, జానీ, విజయ, జ్యోతి, శకుంతల, పావని వెంకట్, ప్రసాద్, మధు, శ్రీనివాస్, సంధ్య రాణి, ప్రవీణ్, జయశ్రీ, హరితరాణి, నాగజ్యోతి, సుజిత, లీలా కుమారి, దివ్య, మృదుల, వెంకటయ్య, యాదమ్మ, కోమల, వైష్ణవి, , భారతి, నరేష్, సోమేశ్వరి, గాయత్రి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నమస్తే తెలంగాణ రిపోటర్ రవి నీ పరామర్శించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ మే 11 ( వార్త వేదిక సూర్య ):-



గుడిపల్లి మండల రిపోటర్ రవి కి కందిరిగల్ కరవడం వల్ల గాయపడిన రవి నీ పిఏపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.

# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

## పోలీస్ గ్రీవెన్స్ డే లో బాధితుల ఫిర్యాదుల స్వీకరణ

నల్లగొండ బ్యూరో, మే 11 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయం లో ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమం లో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీ కి వివరించగా, ఆయా ఫిర్యాదులను ఓర్పు తో విని సంబంధిత అధికారులకు తక్షణ విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి బాధితులకు సరైన న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించవచ్చని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ తెలిపారు.





## బండి భగీరథ్ పైన కేసు నమోదు అయ్యి మూడు రోజులైనా అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : ఎం ఆర్ పి ఎస్ చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు

దేవరకొండ మే 11 (వార్త వేదిక సూర్య )

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పైన కేసు నమోదు అయ్యి మూడు రోజులైనా నేటికీ అరెస్టు చేయకుండా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బండి సంజయ్ సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకుని కేసును నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు అని ఎం ఆర్ పి ఎస్ చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు డిమాండ్ చేశారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు బండి సంజయ్ బీజేపీ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేసి తన కుమారుడు బండి భగీరథుడు పై కేసు నమోదైన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు తెలంగాణలో రేపిస్టులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు తెలంగాణలో మత రాజకీయాలు చేయడం బిజెపి కి అలవాటు అని ఆయన అన్నారు

## భగీరథ్‌పై పోక్సో కేసులో సెక్షన్ 21 సెగ.. బండి సంజయ్ కూడా విచారణకు!

హైదరాబాద్ (వార్త వేదిక సూర్య )

బాలికపై బండి భగీరథ్ లైంగిక వేధింపుల కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఆయన అనుచరుడు సంగప్ప కూడా విచారణ ఎదుర్కోక తప్పదని న్యాయ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. పోక్సో కేసు నమోదై నాలుగు రోజులైనా నిందితుడి ఆచూకీని గుర్తించడంలో పోలీసులు విఫలమవడం, బాధితురాలి వాంగ్మూ లం తీసుకొనే క్రమంలో వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించి దర్యాప్తునకు ఆదేశించడం, పర్యవేక్షణకు మహిళా ఐపీఎస్‌ను ప్రత్యేకాధికారిగా నియమించడంతో కేసు కీలక మలుపు తిరిగింది. దీంతో లోతైన దర్యాప్తు జరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇదే సమయంలో నిందితుడిని కాపాడేందుకు మధ్యవర్తులుగా సహకరించిన వారికి సైతం ఉ చ్చుబిగిసే అవకాశాలు ఉన్నాయని న్యాయనిపుణులు చెప్తున్నారు.తెలంగాణ వార్తలు పోక్సో చట్టంలోని సెక్షన్-21 ప్రకారం నేరం జరిగినట్టు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం పౌరుల క నీస బాధ్యత అని చెబుతున్నారు. నేరం జరిగినట్టు సమాచారం ఉండీ.. దానిని పోలీసులకు చె ప్పకుండా దాచడం, లేదా నిందితుడిని రక్షించే ప్రయత్నం చేయడం శిక్షార్హమైన నేరమని వా రంటున్నారు. భగీరథ్‌పై నమోదైన కేసులో సంజయ్, సంగప్ప మధ్యవర్తులుగా వ్యవహరించారని, సెటిల్‌మెంట్‌కు ప్రయత్నించారన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి.

**సాక్ష్యాలు దొరికితే విచారణ తప్పదు**

బాధితురాలి తల్లి ఫిర్యాదులో పలు కీలక విషయాలను ప్రస్తావించారు. కేంద్ర మంత్రి స మక్షంలోనే బాధితులను బెదిరించడం, 'నువ్వు మైనర్‌వి' అని పదే పదే మంత్రి గుర్తుచేయడం, బెదిరింపు ధోరణితో మాట్లాడటం వంటివి చట్టపరంగా నేరమన్నది న్యాయనిపుణుల వాదన. దీంతో సంజయ్‌కి సన్‌స్ట్రోక్ తప్పదా? అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. పోలీసులు ఇప్పటికే బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించారు. నిజానిజాలు నిర్ధారణ కోసం పలువురి నుంచి వివరాలు సేకరించే అవకాశాలున్నాయి. నిందితుడి స్నేహితులతో పాటు కేసు రాజీకి ప్ర యత్నించిన సంగప్ప, సంజయ్‌ని సైతం విచారించే అవకాశాలున్నాయి. మధ్యవర్తిత్వం, బెది రించడం, సాక్ష్యాలను మార్చేందుకు ప్రయత్నించినట్టు సాక్ష్యాలు లభిస్తే సంగప్పతోపాటు సంజయ్‌ని కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చవచ్చని, అవసరమైతే అరెస్ట్ చేసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. నిందితుడిని కాపాడే ప్రయత్నాలు జరిగితే వాటిని నేరపూరిత కుట్రగా దర్యాప్తు అధికారులు భావిస్తారన్నారు.

**నిర్మల్ పోలీసుల పాత్రపై ఆరా**

బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో నిర్మల్ పో లీస్‌స్టేషన్ ప్రస్తావన తెచ్చారు. ప్రధాన నిందితుడైన భగీరథ్ స్నేహితుడు శ్రీరామ్ తమపై ఫి ర్యాదు చేశాడని బాధితురాలి తల్లి పేర్కొన్నారు. తన కూతురిని భగీరథ్‌కు పరిచయం చేసింది శ్రీరామ్ అని, తన కూతురు బ్లాక్‌మెయిల్ చేస్తున్నదంటూ శ్రీరామ్ తప్పుడు ఫిర్యాదు చేశారని ఫిర్యాదులో వెల్లడించారు. ఈ విషయంపైనా ద ర్యాప్తు అధికారులు దృష్టిసారించి, నిర్మల్ పోలీసుల పాత్రపై ఆరా తీస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేయలేదని చెప్తున్నా, ఫిర్యాదు వచ్చిన తర్వాత ఎందుకు లోతుగా దర్యాప్తు చేయలేదని ఆరాతీసే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

**దర్యాప్తు స్వేచ్ఛగా జరగనిస్తారా?**

మైనర్‌పై లైంగిక హింస జరిగితే నిబంధనల ప్రకారం వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలి. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి ఈ విషయం తెలియదా? ఆయనే పోలీసులకు స్వయంగా చెప్పాల్సి ఉన్నా, సెటిల్‌మెంట్‌కు ఎలా ప్రయత్నించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పైగా సంజయ్‌కి రాష్ట్ర ప్రభుత్వ పెద్దల అండదండలు ఉన్నందున కేసు దర్యాప్తు అధికారికి స్వేచ్ఛ ఇస్తారా? దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందా?, హడావుడి చేసి, కేసును పక్కదారి పట్టిస్తారా? బాధితు రాలికి తగినన్యాయ ంచేస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# బండి భగీరథ్ పై కేసు నీరుగార్చేందుకు ప్రయత్నం

### -దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ మే 11 (వార్త వేదిక సూర్య ):-

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పైన కేసు నమోదు అయ్యి మూడు రోజులైనా అరెస్టు చేయకుండా రాష్ట్ర హోం శాఖ మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకుని కేసును నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడుపై పొక్సో కేసు నమోదైన నిందితుడిని అరెస్టు చేయాల్సి ఉన్న వారిని కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తా ఉన్నట్లు కనపడతా ఉంది అని ఆయన ఆరోపించారు.

గంగుల కమలాకర్ చేతిలో బండి సంజయ్ మూడుసార్లు ఓడిపోయినాడు. రామ మందిరం పేరుతోనే బండి సంజయ్ గెలిచాడు తప్ప సొంత బలం ఏమీ లేదు అని ఆయన అన్నారు. 2018కి ముందు తన రాజకీయ భవిష్యత్తు కోసం బిక్షాటన చేస్తూ చందాలు వసూలు చేసిన బండి సంజయ్ కి నేడు వందల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చినయ్ అని ఆయన అడిగారు. నీ రాజకీయ చరిత్ర అందరికీ తెలుసు అని, బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసుకుంటూ, రేవంత్ రెడ్డి తో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ బిజెపి పార్టీని, ధర్మాన్ని తాకట్టు పెట్టుకుంటూ ముసలి కన్నీరు కారుస్తూ ఉన్నారు అని అన్నారు. ధర్మం పేరుతో నీవు చేసే బ్లాక్ మెయిల్ రాజకీయాలు టైం వచ్చినప్పుడు బయటపడతాయి. ఏనాటికైనా నిజాం బయటపడుతుంది అని ఆయన అన్నారు ముసలి కన్నీరు కాదు, దేవుని పేరు చెప్పడం కాదు, ధర్మం పేరు చెప్పడం కాదు, వెంటనే రాజీనామా చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. 18 సంవత్సరాల లోపు అమ్మాయిల మీద హనీ డ్రాప్ కేసు వర్తించదు. మైనర్ బాలికపై హనీ ట్రాప్ కేసు పెట్టడంలోనే బండి బండి సంజయ్ చేసే అధికార దుర్వినియోగం చేస్తున్నారు అని ఆయన అన్నారు. అవును మేము కలిసి తిరిగినం, పార్టీలకు వెళ్లిన అంటూ బండి కుమారుడే ఒప్పుకున్నాడు అని ఆయన అన్నారు. పోక్సో కేసును నీరుగాచేందుకు నాకు మాత్రం సెక్షన్లు పెట్టినారు అని ఆయన అన్నారు. ప్రజలు ఆలోచన చేయాలే. దేశం పేరుతో, ధర్మం పేరుతో వచ్చే నాయకులను నమ్మొద్దు అని ఆయన అన్నారు. అధికారం శాశ్వతం కాదు రేవంత్ రెడ్డి నిన్ను కాపాడుతాడు అనుకోవడం నీ భ్రమ. ప్రజాక్షేత్రంలో మీకు గుణపాఠం తప్పదు అని ఆయన అన్నారు. కేంద్రంలో బండి సంజయ్ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పోలీసులను కబంధహస్తాల్లో పెట్టుకొని వారిని విచారణ చేయకుండా ఉల్టా బ్లాక్ మెయిల్ చేస్తా ఉన్నారు. మైనర్ బాలిక అత్యాచారం కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి. లేదంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బండి సంజయ్ను బర్త్ రఫ్ ఆఫ్ చేయాలి అని ఆయన అన్నారు. బండి సంజయ్ కుమార్ బాలిక తల్లిదండ్రులను బ్లాక్ మెయిల్ చేసిండు అని స్పష్టంగా ఆధారాలు ఉన్నాయి. కాబట్టి ఈ కేసు ఎఫ్ఐఆర్ లో బండి సంజయ్ పేరును కూడా చేర్చాలి అని ఆయన అన్నారు. దేశం, ధర్మం మీద గౌరవం అంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి. బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ బిఆర్ఎస్ పార్టీ బాధితుల పక్షాన అండగా ఉంటుంది అని ఆయన అన్నారు. ఉన్నోడికి ఒక న్యాయం, పేదోడికి ఒక న్యాయమా నిష్పక్ష విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి లేదంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బండి సంజయ్ ని వెంటనే బర్తరఫ్ చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీ అన్నట్టు సాగుతున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాటకాలను త్వరలోనే బయట పడుతాయి అని ఆయన అన్నారు

## ధాన్యం కొనుగోళ్లలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ముందు ధర్నా



నల్గొండ టౌన్ మే 11 (వార్త వేదిక సూర్య)

నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య , జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులు...

కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహించి, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత నెల రోజులుగా జిల్లాలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నాను.. రైతులు తీవ్ర ఇబ్బందులు, ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నారు... ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లలో అనేక సమస్యలు చోటుచేసుకుంటున్నాయి..ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో వడ్లు రోజుల తరబడి పేరుకుపోతున్నాయి..రైతులు తీసుకొచ్చిన వడ్లలో అధికంగా తేమ, నాణ్యత పేరుతో అనవసర కోతలు విధిస్తున్నారు...దళారులు రైతులను భయపెట్టి తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసి అధికంగా డబ్బులు దండుకుంటున్నారు..కాంటాలు సకాలంలో జరగక రైతులు ఎండలో, వర్షంలో రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్ యార్డుల్లో కాంగ్రెస్ నాయకులు మరియు వారి అనుచరులు పెత్తనం చెలాయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు..కొనుగోలు కేంద్రాల్లో సరైన పర్యవేక్షణ లేక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు..తార్పాలిన్లు, తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కూడా కొనుగోలు కేంద్రాల్లో లేవు..కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు ఆలస్యం అవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు..కొందరు మధ్యవర్తులు అధికారులతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతున్నా సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదు..అన్ని కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కాంటాలు నిర్వహించాలి..సరిపడా లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంటనే తరలించాలి..రైతుల వడ్లలో అన్యాయ కోతలు నిలిపివేయాలి..దళారుల దందాపై కఠిన చర్యలు తీసుకోవాలి..మార్కెట్ యార్డుల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలి..రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.. దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాము..సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ 15 రోజుల్లోపు ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు..

## చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్గొండ టౌన్ మే 11 (వార్తా వేదిక సూర్య)



నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని ప్రముఖ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది.

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం ఆలయానికి చేరుకుని శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.

అనంతరం ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీ వారాల రమేష్ గారు మరియు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ "చెర్వుగట్టుశ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయం ఎంతో పురాతనమైనది, మహిమాన్వితమైనది. నూతన కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేసి ఆలయ అభివృద్ధికి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా పనిచేయాలి. ఆలయ అభివృద్ధికి నా సంపూర్ణ సహకారం ఉంటుంది" అని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఊశయ్య, నార్కట్‌పల్లి , చెర్వుగట్టు, ఎల్లారెడ్డి గూడం, సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు , దేవాదాయ శాఖ అధికారులు, పూర్వ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష

### - ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్గొండ టౌన్ మే 11 (వార్తా వేదిక సూర్య)

నకిరేకల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు సమీక్ష సమావేశం నిర్వహించారు. నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్న పేట మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరు, రోజువారీ కొనుగోళ్లు, రైస్ మిల్లులకు తరలింపు, రైతులకు చెల్లింపులపై ఎమ్మెల్య అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులను ఆదేశిస్తూ "ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి, ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలి. గన్నీ బ్యాగులు, తేమ కొలిచే మీటర్లు, తూకం యంత్రాలు సరిగ్గా పనిచేసేలా చూసుకోవాలి" అని సూచించారు. "రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. రైతు కష్టానికి సరైన గౌరవం దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. ఏ రైతుకూ అన్యాయం జరగకుండా చూడటం మనందరి బాధ్యత" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ , జిల్లా పౌరసరఫరాల అధికారులు , వివిధ మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ చాణ, చూా లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ×ఖ్రా,ూాజూ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక





**మోత్కూరు, మే 11 (వార్త వేదిక సూర్య):** మండలంలోని పాలడుగు గ్రామంలో గత రెండు రోజులు గా జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం మండలం మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి ప్రకటించారు. అధ్యక్షులుగా పిట్టల చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కురిమేటి యాదయ్యతో పాటు మరో అరుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.. నూతనంగా అధ్యక్ష కార్యదర్శులు గా ఎన్నికైన కురిమేటి యాదయ్య లు మాట్లాడుతూ. గ్రామాలలో పేదలకు స్థానికంగా ఉపాధి కల్పిస్తున్న ఉపాధిహామీ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని, అన్నారు. ఉపాధి హామీ చట్ట రక్షణకు ప్రజలను చైతన్యం చేసి ప్రతి,నిత్యం వ్యవసాయ కూలీల సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తామని,వ్యవసాయ కార్మిక సంఘాన్ని మరింత బలోపతం చేసెందుకు కృషి చేస్తామని అన్నారు.

# మహేశ్వరం టు షాద్నగర్ ఆర్టీసీ బస్సు నడపాలి

**మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీ సుధకి కి వినతి పత్రం అందించిన**

**మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్**



**మహేశ్వరం మే 11 వార్త వేదిక సూర్య** మహేశ్వరం సర్పంచ్ పాలక వర్గ సభ్యులు మహేశ్వరం డిపో టీజీఎస్ ఆర్టీసీ మేనేజర్ లక్ష్మి సుధా ని కలిసి ,మహేశ్వరం నుండి షాద్ నగర్ వయా అమీర్పెట్, తిమ్మాపూర్ మహేశ్వరం గ్రామం నుండి జేబీఎస్ , సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందించారు . అనంతరం మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,మాట్లాడుతూ గ్రామంలో కార్మికులు వివిద కంపనీల యందు పని చేయుటకు వెళ్తున్నవారికి మరియు, కాలేజీ ు స్కూల్ విధ్యార్థిని, విధ్యార్థులకు గ్రామం నుండి హైదరాబాద్ నగరానికి రైతులు తమ యొక్క సరుకులను తీసుకెళ్లుటకు అనేక ఇబ్బందులు పడుతున్నారని గ్రహించడం జరిగిందని తెలుపూ అట్టి సమస్యను పరిష్కరించుటకై డిపో మేనేజర్ లక్ష్మీ సుధా ని కలిసి మరికొన్ని అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు . ఇట్టి కార్యక్రమములో మహేశ్వరం , వార్డు సభ్యులు ఆకుల వీరిబాబు, తదితరులు పాల్గొన్నారు,

# డిగ్రీ కళాశాలలో ఘనంగా విద్య వారోత్సవాలు ప్రారంభం




**రామన్నపేట ( వార్త వేదిక సూర్య )మే 11** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా మొదటి రోజు మౌలిక వనరుల సదుపాయాన్ని పెంపొందించుకునే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. రూసా నిధులతో నిర్మించబడిన వెహికల్ షెడ్డుతో పాటు ప్రధాన రోడ్డు నుండి కళాశాల భవనం వరకు వేసిన సిసి రోడ్డును కూడా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో మౌలిక వనరుల కల్పన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కళాశాలలో మౌలిక వనరుల సదుపాయాలను పెంపొందించే కార్యక్రమాన్ని విద్యా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించాలని తెలియజేయడం జరిగిందని, అందులో భాగంగానే సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా 2026 - 27 విద్యా సంవత్సరానికి గాను కళాశాల అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రమును కూడా ఆవిష్కరించారు. రామన్నపేట పరిసర ప్రాంతాల్లోని ఇంటర్మీడియట్ పాసైన ప్రతి విద్యార్థి ఈ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం ఇంచార్జ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, సభ్యులు డాక్టర్ పి. బ్రహ్మం, డాక్టర్ జె. నరేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, ఐ క్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, ఎం. అనిత,డాక్టర్ డి. కిషన్, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, టి.శ్రీనివాస్, ఏ. ఆంజనేయులు, రాధికతో పాటు కార్యాలయ సిబ్బంది కరుణాకర్ రెడ్డి, ఫయాజ్, షరీఫ్, శ్రీదేవి, రాంబాబు, కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుకు భూ నిర్వాసితులు వినతి



**యాదగిరిగుట్ట మే 11(వార్త వేదిక సూర్య ) :** యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధికి భూములు ఇచ్చి సహకరించిన రైతులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు కు వినతి పత్రం ఇచ్చారు. కొండపైన వర్తకులకు అనుకూలంగా మాట్లాడుతున్న రాజకీయ నాయకులు గతంలో వారికి వ్యతిరేకంగా మాట్లాడిన వారే, అధిక ధరలకు వస్తువులను అమ్మి భక్తులను దోపిడీ చేస్తున్న విషయము అన్ని రాజకీయ పార్టీలకు తెలిసిందే, దీన్ని దృష్టిలో పెట్టుకొని కొండపైన వర్తక సంఘం దుకాణాలకు వేలం వేయాలని వర్తక సంఘం అధ్యక్షుడిగా కర్రే వెంకటయ్య గతంలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం మాట మార్చి వర్తకుల కడుపు కొట్టడం సరికాదని వాఖ్యానిస్తున్నారు. కోట్లకు పడగలెత్తిన వర్తకులకు వత్తాసు పలకడం సరైనది కాదు. దేవస్థానం ఆదాయానికి ఏడాదికి సుమారు రూ. 30 కోట్లు నష్టపరిచే వర్తకులకు మద్దతు తెలపడం అన్యాయమని భావిస్తున్నామన్నారు . కొండకు ఉత్తర దిక్కులో గండిచెరువు నుండి ఊరకుంట చెరువు వరకు 93.03 ఎకరాల భూములను స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులకు ఎలాంటి దుకాణాలు లేవు. మేము ఇచ్చిన భూముల్లోనే వర్తకులకు దుకాణ సముదాయాలు కట్టించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వర్తక సంఘము వారికి ఎలాంటి ఆర్థిక, ఆస్తి నష్టం జరగలేదు. కానీ, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు తాత ముత్తాతల నుంచి సంక్రమించిన వందల ఏళ్లనాటి భూములను, రైతులు జీవనోపాధిని కోల్పోయి అప్పగించి ప్రభుత్వానికి అండగా నిలబడ్డారు. రైతు కుటుంబాలతో పాటు నిరుద్యోగ యువత కూడా ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. అయినప్పటికీ స్థానికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఉపాధి కోసం న్యాయం జరగాలని రైతులు, నిరుద్యోగులం నిస్వార్ధ పోరాటం చేస్తున్నాం. దేవాదాయ ధర్మదాయ డైరెక్టర్ గా ఉన్న మీరు ఇప్పటికైనా నష్టాన్ని గుర్తించి వర్తక సంఘంలోని దుకాణాలను టెండర్ నిర్వహించాలని కోరుతున్నాము. వినతి పత్రం సమర్పించిన వారిలో బూడిద సురేందర్, బూడిద నాగరాజు, బూడిద దేవమ్మ,బూడిద పద్మ, బూడిద నరసింహ, బూడిద సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాటిమట్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి కృషి చేస్తా

**ఎమ్మెల్యే మందుల సామేల్**

**మోత్కూరు, మే 11 (వార్త వేదిక సూర్య):** మండలంలోని వాటిమట్ల గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి కృషి చేస్తానని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. సోమవారం పాటిమట్ల ఎస్సీ కాలనీలో ఆ కాలనీకి చెందిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో కంటే పాటిమట్ల గ్రామం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, ఈ గ్రామాన్ని మండలంలో ముందంజలో ఉండే విధంగా కృషి చేస్తానని ఆ.కాలనీకి చెందిన వివిధ సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. సమస్యలను ఏకరవుపెట్టిన ఎస్సీ కాలనీ వాసులు. ఈ ఎస్సీ కాలనీలో రైతులకు ప్రత్యేకంగా ఒక ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని, లూజ్ లైన్ క్రింద ఆరు విద్యుత్ స్తంభాలు చేయాలని, పాటిమట్ల గ్రామం నుండి ఎక్స్ రోడ్డు వరకు చెరువు కట్ట క్రింద సల్లోని బావి, కుమ్మరి బావిల వద్ద రక్షణ గోడలకు నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు





క్రైటిరియా ప్రకారం ఎక్కువ శాతం ఇండ్లు మంజూరు చేయించాలని, ఇటీవల మంజూరైన ఎస్సీ కమ్యూనిటీ హాల్ కు త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలని, సదర్ షాపూర్ రోడ్డు కు బృందావన్ కాల్వ మీద కల్వర్టు నిర్మించాలని స్థానికుడు అదే కాలనీకి చెందిన కురిమేటి యాదయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాలను పరిగణంలోకి తీసుకున్న ఎమ్మెల్యే సంబంధిత పనులను అధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు యాదయ్య తెలిపారు. అనంతరం తమ కాలనీకి వచ్చిన ఎమ్మెల్యే సామేల్ ను ఆ కాలనీ చెందిన కుల పెద్దలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండ రమ విజయ్ రెడ్డి, తహశీల్దార్ పి. జ్యోతి, ఎంపీడీవో బాలాజీ, సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు. కాలనీవాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ హెచ్ ఓ శోభన్ బాబుకు హనుమాన్ జయంతి ఉత్సవాల ఆహ్వానం

**గుండాల వార్తవేదిక సూర్య న్యూస్ ప్రతినిధి మే 11 :** ఎస్సై ఏం శోభన్ బాబు ని గుండాల పి ఎస్ పరిధిలో మర్యాదపూర్వకంగా కలిసి సుద్దాల హనుమాన్ భక్త మండలి టీం శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఈ సందర్భంగా ఎస్సై ఎమ్ శోభన్ బాబు మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ కిలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రాంతంలోని శాంతి భద్రతల పరిస్థితులు, గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న కొన్ని సమస్యల గురించి చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పనిచేస్తుందని ఎస్సై శోభన్ బాబు తెలిపారు. అలాగే ప్రజలు కూడా చట్టాలను గౌరవిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని, గ్రామాల్లో ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో పరస్పర అభిప్రాయాలు పంచుకుంటూ సమాజంలో శాంతి



భద్రతలు కాపాడేందుకు కలిసి పనిచేయాలని ఎస్సై శోభన్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ కాసం నాగేష్ హనుమాన్ ఆలయ చైర్మన్ బత్తిని మహేష్ గౌడ్ మాజీ జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ చైర్మన్ బత్తిని రాజు గౌడ్, గడ్డమీది పరుశరాములు గౌడ్, గడ్డమీది నవీన్ గౌడ్,పాల్గొన్నారు.

# రైతులకు కల్లాల వద్దనే ధాన్యం కొనుగోలుకు అనుమతించాలి



**మోత్కూరు, మే 11 ( వార్త వేదిక సూర్య):** ధాన్యం కొనుగోలు జాప్యం చేయకుండా రైతుల తెచ్చిన ధాన్యాన్ని కల్లాల వద్దనే కొనుగోలుకు అనుమతించాలని బిజెపి పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజులుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ లో ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంవల్ల మార్కెట్ లో పూర్తిగా ధాన్యం కుప్పలు ఉండడం వల్ల ధాన్యం ఆరబోయడానికి అవకాశం లేదన్నారు. మ్యాచర్ సరిగా రాకపోవడం తాలు తీసివేయడం హమాలీలు,వాహనాల కొరత వల్ల ధాన్యం కొనుగోలు ఇంకా రెండు నెలలైనా పూర్తి అయ్యే పరిస్థితి లేదన్నారు అకాలవర్షం వస్తే మార్కెట్ లో ధాన్యం కుప్పలను పక్కకు జరిపే స్థలం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని నివారించడానికి రైతుల వద్దనే ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇస్తే నాణ్యత ప్రమాణాలు అక్కడే చూస్తే రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ధాన్యానికి బన్నీ బ్యాగులు ఇస్తే రైతులే కాంటాలు వేసి సొంత వాహనాల్లో ట్రాన్ పోర్ట్ రైస్ మిల్లర్ల దగ్గరికి తీసుకుపోయే అవకాశం ఉందని,ఈ విధానం వల్ల ధాన్యం తొందరగా రైస్ మిల్లర్ల వద్దకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు రైతుల కల్లాల వద్దనే ధాన్యాన్ని కొనుగోలుకు అనుమతి ఇప్పించాలని కోరారు.

# యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**యాదగిరిగుట్ట మే 11(వార్త వేదిక సూర్య ) :** పట్టణం లో యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొండపైన వర్తక సంఘం రద్దు చేయాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం పాత గుట్ట చౌరస్తా వద్ద చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొండపైన వర్తక సంఘం పేరుతో జరుగుతున్నటువంటి ఆర్థిక దోపిడి గురించి, మరియు 114 షాప్ వాళ్ళు,వారి సొంత ఆస్తిలాగా గత కొన్నేళ్లుగా వారే అనుభవిస్తూ టెండర్ లు వేయకుండా కొత్తవారికి, నిరుద్యోగులకు ఉపాధి కల్పన లేకుండా చేయడం, మరియు గతం లో ఉన్న 14 షాప్ లు ఇప్పుడు 114 షాప్ లు గా ఎలా పెరిగాయి. వారికి ఏ ప్రతిపాదికన షాపులు కేటాయించారు ఆ లిస్ట్ బయటకు వెల్లడించాలని ప్రశ్నించడం జరిగింది. ఇట్టి వివరాలు అన్ని అక్కడికి వచ్చిన స్థానిక ప్రజలకు వివరిస్తూ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని అన్నారు . ఈ సంతకాల ప్రతులను సంబంధిత దేవాదాయ ధర్మాదాయ శాఖ వారికి, ప్రభుత్వ పెద్దలకు ఇవ్వడం జరుగుతుంది అని కమిటీ వారు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాటబత్తిని ఆంజనేయులు , సుడుగు జీవన్ రెడ్డి, పల్లపు బాలయ్య, దేవపూజ అశోక్, దండబోయిన వీరేష్, బండ రామస్వామి, గ్యాదపాక బాల్ నర్సింహా, మాటూరి బాలయ్య, బుగ్గా ఆంజనేయులు, పబ్బాల ఉప్పలయ్య, మిరియాల క్రిష్ణ , కల్వకొలను సతీష్, కొన్నే సంజీవ, బండి అనిల్, గోపగాని ప్రసాద్, కర్రే ప్రవీణ్, మందోజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# బండి సంజయ్ కేంద్ర మంత్రి ఎంపీ సభ్యత్వానికి వెంటనే రాజీనామా చేయాలి

**ఏఐఎస్ఎఫ్ డిమాండ్**

**మోత్కూరు, మే 11 (వార్తా వేదిక సూర్య):** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడుపై షీట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో నమోదైన పోక్సో కేసును ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్ష పాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని,ఆయన కుమారుడు ఘటనపై బాధ్యత వహించి బండి సంజయ్, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాంతి కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కుమారుడని బాధిత మైనర్ బాలికకు అన్యాయం జరగకుండా నిస్పక్ష పాతంగా విచారణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతమ్, నర్సింహ్మా, నగేష్, ధనంజనేయులు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 345
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
మంగళవారం,
మే 12, 2026

# ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను ప్రారంభించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





**మహేశ్వరం మే 11 వార్త వేదిక సూర్య:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి జిల్లాలగూడ డివిజన్ పరిధిలోని మిథుల నగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అక్కల భూపాల్ రెడ్డి, డిప్లాల్ చౌహాన్, అరకల కామేష్ రెడ్డి, మదారి రమేష్, అనిల్ కుమార్ యాదవ్, విజయ్, దిండు భూపేష్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్, సునీత బాలరాజ్, సుర్వి లత, పంతంగి మాధవి, బిందు, నిర్మల రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# సదర్శపూర్‌లో ఇంటింటికి జనగణన



**మోత్కూరు, మే 11 (వార్తా వేదిక సూర్య):** జనగణన ప్రక్రియలో బాగంగా మున్సిపల్ కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో జనగణన ప్రక్రియను సోమవారం ఎన్యూమారీటర్లు అధికారులు ప్రారంభించారు. మండలంలోని సదర్శాపూర్ గ్రామంలో ఎన్యూమారేటర్లు సుధీర్, నాగలక్ష్మిలు ఇంటింటికి తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ జనగణన ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్ రమేష్,ఉప సర్పంచ్ తీగల వినోద్,వార్డు సభ్యులు దొండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి మండల టాపర్‌గా నిలిచిన ఉషశ్రీని అభినందించిన నర్సింహ్మా రెడ్డి



**మోత్కూరు, మే 11 ( వార్తా వేదిక సూర్య ):** ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొక్కుల ఉషశ్రీని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహ్మా రెడ్డి అభినందించారు. సోమవారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రతిభా పురస్కారాల కార్యక్రమం సంధర్భంగా తన కార్యాలయంలో ఉషశ్రీని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవినేని అరవిందరాయుడు ఉపాధ్యాయులు తొర్ర ఉప్పలయ్య విద్యార్థిని తండ్రి కొక్కుల రమేష్ ఉన్నారు.

# పాఠశాలలో నెలకొన్న మౌళిక సదుపాయాలకు కృషి

## ఎమ్మెల్యే మందుల సామేల్





**మోత్కూరు, మే 11 ( వార్త వేదిక సూర్య):** పాఠశాలలో నెలకొన్న మౌళిక సదుపాయాలకు నిరంతరం కృషి చేస్తానని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మండలంలోని దాచారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో 5 లక్షల రూపాయలు వ్యయంతో మంజూరైన వంటగదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఏలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకవస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కర్నే జ్యోతివీరేశం, ఉప సర్పంచ్ భీమనబోయిన అవిలయ్య, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

## రూ . 1.60 లక్షల నగదు అపహరణ





**మోత్కూరు, మే 11 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసి లోనికి చొరబడి సుమారు రూ.1.60 లక్షల నగదును అపహరించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, శనివారం గ్రామానికి చెందిన దొంతి మత్స్యగిరి శనివారం (రెండు రోజుల క్రితం) తన బంధువుల ఇంట్లో బొడ్రాయి పండుగ కార్యక్రమం ఉండటంతో కుటుంబ సభ్యులతో కలిసి వలిగొండ మండలం మల్లేపల్లి గ్రామానికి వెల్లాడు. ఇంటికి తాళం వేసి వెల్లిన ఆయన సోమవారం సాయంత్రం తిరిగి స్వగ్రామమైన బుజిలాపురం చేరుకున్నాడు. అయితే ఇంటి వద్దకు వచ్చి చూడగా తలుపుకు వేసిన తాళం తీసి ఉ ండటాన్ని గమనించి అనుమానం వ్యక్తం చేశాడు. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లోని వస్తువులు,నగదు పరిశీలించగా దాచి ఉంచిన లక్ష అరవై వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు తెలిసి, వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించి విచారణ చేపట్టారు. బాధితుడు మత్స్య గిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు విలేకరులకు తెలిపారు. గ్రామాలల్లో రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గంగారంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**మహేశ్వరం, మే 11 వార్త వేదిక సూర్య:** మహేశ్వరం మండలం గంగారం గ్రామపంచాయతీలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన పాల్త్య జ్యోతి జయరాం కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కేఎల్ఆర్ సహకారంతో పాటు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో, ఇటీవల నిర్మాణం పూర్తిచేసుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ దేవేందర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగారం గ్రామంలో ఇప్పటివరకు 60 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 45 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇంకా అర్హులైన పేద కుటుంబాలు ఉంటే గుర్తించి, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కేఎల్ఆర్ సహకారంతో మరిన్ని ఇళ్లు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రెండు సీసీ రోడ్ల పనులు కూడా పూర్తి చేశామని తెలిపారు. గంగారం గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు ఎం.మోహన్, ఎం.రవి, ఎం.ధర్మ, ఎం.పద్మదేవ,శ్రీనివాస్, జయరాం, మాజీ ఎంపీటీసీ పాండు నాయక్ గ్రామ పెద్దలు, తదిరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలు,కోతులు పందులను నివారించాలని కలెక్టర్‌కు వినతి

**మోత్కూరు, మే 11 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో వీధి కుక్కలు,కోతులు, పందులను నివారించాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు బయ్యని రాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఉదయం వేళలో మార్నింగ్ వాకింగ్ వెళ్తుంటే వీధి కుక్కలు, కోతులు వెంటాడుతున్నాయని, వీటికి తోడు పందులు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతున్నాయని తెలిపారు. ఇండ్లలల్లో నుంచి చిన్నారులు, పెద్దలు బయటికి వెళ్లాలంటే వీధి కుక్కలు కోతులతో భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీధి కుక్కలు, కోతులు, పందుల నివారణపై గతంలో ఎన్నోసార్లు మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేద న్నారు. ఇప్పటికైనా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో వీధి కుక్క లను,కోతులు, పందులను నివారించాలని కలెక్టర్ కు విన్నవి ంచగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు రాజు తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల



**యాదగిరిగుట్ట మే 11 ( వార్త వేదిక సూర్య ) :** పట్టణంలోని నాల్గవ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన స్వప్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆప్యాయంగా అభినందించి, పట్టు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.









Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**